# తండ్రులు: కుమారులు - గోపీచంద్ ★

తన వివాహానికి వచ్చిన యితరబంధువులతో పాటు పెదతండ్రిని వెళ్ళనివ్వలేదు కుటుంబరావు. పదిరోజులువుండి వెళ్లమని కోరాడు. ఆయన కూడా కుటుంబరావు మాటతీసివెయ్యలేక ఆగాడు.

తన పెదతండ్రిని చూచి కుటుంబరావు చాలాబాధపడ్డాడు, ఒకప్పుడు ఆయనకు వందఎకరాలసేద్యం వుండేది. స్టేషనుదగ్గర ఒకధాన్యపు ఫాక్టరీ వూళ్లోఒకబట్టలకొట్టు వుండేవి. అచుట్టుప్రక్కల ఆయనమాట అప్రతిహతంగా చెల్లిపోతూ వుండేది. చెరువుగట్టుమీద నిలబడి వొక్కగద్దింపు గద్దిస్తే వూరువూరు గజగజ వణికిపోయేది. అటువంటిమనిషి ఇటీవలచాలా కష్టాలు పడుతున్నాడని విన్నాడు కుటుంబరావు. ఆస్థి చితికి పోయింది. చెట్టంత కొడుకువుండీ ప్రయోజనం లేకపోయింది. ఆయనతల్లిదండ్రుల పోషణకు దమ్మిడీ యివ్వనని చెప్పాడట. కొడుకే ఈవిధంగావుంటే ఇకఅల్లుళ్ళసంగతి వేరేచెప్పాలా?

ఈసంగతులన్నీ కుటుంబరావుకి కర్ణాకర్ణిగా మాత్రమే తెలిసినై. కుటుంబరావు తండ్రి డాక్టరుప్యాసై, స్వగ్రామం విడచిపెట్టి మద్రాసులో ప్రాక్టీసు చేస్తున్నాడు. అప్పటినుంచీ బంధువుల రాకపోకలు తగ్గినై అందువల్ల మారుమూలవున్న తనస్వగ్రామములో జరిగేసంగతులు వాళ్ళకు కర్ణాకర్ణిగామాత్రమే తెలుస్తున్నై.

కుటుంబరావుకి తన అన్న ప్రవర్తన అర్థం కాలేదు. తనకు జ్ఞాపకం వున్నంతవరకు ఆయన కఠినుడు కాడు. తన చిన్నతనంలో తాను స్వగ్రామంలో వుంటున్నప్పుడు ఆయన కవిత్వంవ్రాస్తుండేవాడు. తమది కవితాకుటుంబం, ఏపరిస్థితుల్లోనూ ఆగౌరవాన్ని నిలబెట్టాలని ఆయనపట్టుదల రఘువంశం, మేఘసందేశం చదువుతూ, వాటిఘనతను అందరికీ చెపుతుండేవాడు. తనకు మనుచరిత్ర చదివి అర్థం చెప్పేవాడు. బ్రాహ్మణేతరుడవటం మూలాన భట్టుమూర్తిపడిన కష్టాలూ, ఇతరకవులవల్ల పొందిన అవమానాలూ చెప్పి కంటతడిపెట్టుకునేవాడు. ఇంటిపని ముట్టుకునేవాడు కాదు. తన పెద్దతండ్రి కూడా ఇంటిపనులేవీ కొడుక్కి చెప్పేవాడుకాదు కొడుకు కవై యశస్సు నార్జించాలనే ఆయన కోర్కెకూడాన.

అప్పటికి తన అన్న స్కూలుఫైనలు చదువుతున్నాడు. రాకపోకలకు తనకొడుకు ఎక్కడఇబ్బందిపడిపోతాడోనని టౌన్లోనే ఒకఇల్లు అద్దెకు తీసుకొని ప్రత్యేకం వంటవాణ్ణి పెట్టాడు, తన పెదతండ్రి. ఆరోజుల్లో కొడుకునిచూచుకొని మురుసుకోవటంతప్ప మరొకపనే వుండేది కాదు పెదతండ్రికి. కొడుకుకోసం ఎంత డబ్బయినా ఖర్చుపెట్టేవాడు. తనకి బాగా జ్ఞాపకం. ఒకరోజు తన పెదతండ్రికొడుకుని చూట్టానికని హైస్కూలికి వెళ్లాడు. ఆ హైస్కూల్లోనే పక్కనున్న జమీందారుకొడుకు ఒకడు చదువుకుంటున్నాడు. అతను వేసుకున్నదుస్తులు చూచి, తనకొడుక్కి అటువంటి దుస్తులులేవని విచారపడి, వెంటనే బజారువెళ్ళి ఆ జమీందారుకొడుకు ధరించిన దుస్తులకంటేం విలువైన దుస్తులుకొన్నాడు కొడుక్కి. క్లాసురూములో ఆ జమీందారు కొడుక్కి ప్రత్యేకం ఒక కుర్చీవేసేవారు. అట్లాగే తనకొడుక్కికూడా కుర్చీ వేయించవలసిందని హెడ్ మాష్టర్ని అడిగాడు. 'నాకొడుక్కంటే వాడి గొప్పేమిటి?' అని పోట్లాడాడు.



రచయిత

ఇటువంటి తండ్రీ కొడుకుల మధ్య మనస్పర్థ ఎలావొచ్చిందో కుటుంబరావు వూహకు అందలేదు. పోనీ తన పెదతండ్రి తప్పేమన్నావున్నా, తన్నంత ప్రేమగా పెంచాడా కొంచం విశ్వాసం అయినా వుండక్కర్లా తన అన్నకి? తండ్రి, తన్ను పెంచి, విద్యాబుద్ధులు చెప్పించి, పెద్దవాణ్ణిచేసిన తండ్రి, తిండికిలేక అల్లాడిపోతుంటే చూస్తూ ఊరుకోటానికి తన అన్నకు మనస్సెట్లా వొప్పింది?

పోనీ అతనుకూడా డబ్బుకులేక ఇబ్బంది పడుతున్నాడా అంటే కాదాయె! అతనికి భార్యతరఫున మంచి ఆస్తి వొచ్చింది. తనేమో మాష్టరీ ఉద్యోగంచేసి సంపాదిస్తున్నాడు. మరెందుకు తల్లిదండ్రుల్ని ఇలా కష్టపెట్టటం? 'తను ఏమి సంపాదించి ఇచ్చాడమేము పెట్టాలిని?' అంటున్నాడట! ఏమి అన్యాయం? తండ్రిని పోషించే సందర్భంలోకూడా వ్యాపారదృష్టి?

కుటుంబరావుకి పెదతండ్రిని అడిగి సంగతి సందర్భాలన్నీ తెలుసుకోవాలనిపించింది. ఇంతవరకు తన అన్నని గురించి ఇతరులు చెప్పినమాటలు విన్నాడు. వాళ్ళు నిజం చెప్పాలని ఎక్కడవుంది? అపవాదు పుట్టించి, దానికి తమ ముక్కలను తగిలించి ఆనందించే జనం ఎక్కువ ఆంధ్రదేశంలో! కాబట్టి యదార్థం తెలుసుకోవటం మంచిది.

"పెదనాన్నా?"

'ఏమిటి నాయనా?"

"నిన్నొకటి అడగాలనివుంది"

"ఏమిటి నాయనా?"

"అన్నయ్య సంగతి—" అన్నాడు కుటుంబరావు.

కొడుకుసంగతి ఎత్తేటప్పటికి ఆయన తల వొంచుకున్నాడు. ఆ సమయంలో ఆయన కుటుంబరావుకి పేలిఆరిన అగ్ని పర్వతం లాగా, కాలిపోయిన మతాబులాగా కనిపించాడు. కొంచం సేపటికి ఆయన వెక్కి వెక్కి ఏడుస్తున్నట్లు అనుమానం కలిగింది. కుటుంబరావు గుండె గుభేలుమన్నది.

"ఊరుకో పెదనాన్నా" అన్నాడు.

ఆయన శోకాన్ని దిగమింగాడు. ఒక్క నిట్టూర్పు విడిచి, "వాడిసంగతి అడక్కు నాయనా కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది," అన్నాడు.

కుటుంబరావు మాట్లాడలేదు. కదిలించి పుండుమీద కారంజల్లటం అన్యాయం అనుకొని ఊరుకున్నాడు. కొంచెం సేపు చూచి పెదతండ్రే ఇలా అన్నాడు.

"వాడు మంచివాడే నాయనా"

"మరి వొదినో"

"నాకుటుంబంలో చిచ్చుపెట్టిందే అది. మమ్మల్ని గడప తొక్కనివ్వదు. మాకు దమ్మిడిఇస్తే వూరుకోదు."

"అన్నయ్య ఆవిడమాట వింటాడా?" అని అడిగాడు కుటుంబరావు.

"అడుగు దాటడు"

"ఎందుకని"?

"మా కర్మ వాడినని ఏం ప్రయోజనం. అసమర్థుడు అనుకోవాలి అంతే. పెళ్ళాం మాటలువిని తల్లిదండ్రుల్ని తరిమివేసే వాళ్ళకు పుట్టగతులుంటయ్యా నాయనా?" ఈ విధంగా మొదలుపెట్టి నెమ్మది నెమ్మదిగా తన కథఅంతా చెప్పాడు పెదతండ్రి. ఆయన తన కొడుకుమీద నిందలుమోపటం ఇష్టంలేనట్టు కనుపించాడు. 'నువ్వూ నా కొడుకుతో సమానమే. నీతో చెప్పకుంటే తప్పేముంది,' అని తన కథ అంతా చెప్పాడు.

అంతవరకూ తమను అత్యంత భక్తితో చూసే కొడుకు, భార్యకాపరానికి రాగానే మారిపోయాడట. బట్టలకొట్టు యెందుకు పెట్టావు? ఫ్యాక్టరీ ఎవరుకట్టించమన్నారు? అని అడిగేవాడట! 'మా చదువుకి ఇంత ఎందుకు? ఖర్చుపెట్టావు తాహతుకి మించిన పనులు ఎవ్వరు చెయ్యమన్నారు? అని అడిగేవాడట. తనకు అత్తవారు కట్నంగా ఇచ్చిన డబ్బు ఇమ్మని పోట్లాడే వాడట. అతనిపోట్లాటభరించలేక, కాపురం ఎక్కడ రచ్చకెక్కుతుందో అనే భయంతో పూర్వులు కట్టించిన మేడ కోడలుపేర వ్రాసి యిచ్చాడట పెదతండ్రి. మర్నాడే తమను ఇంట్లోనుంచి వెళ్ళగొట్టి వేశారట. అప్పటినుంచీ పక్కవూళ్ళో ఒక గుడిసె అద్దెకు తీసుకొని అక్కడ కాలక్షేపం చేస్తున్నాడట. ఉండబట్టలేక ఎప్పుడన్నా కొడుకుని చూచిపోదామని వొస్తే కస్సు బుస్సు మంటారట. మనమణ్ణి దగ్గరకు రానివ్వరట! ఒక్కపూట భోజనంకూడా పెట్టరట! 'అదుగో తినిపెట్టడానికి వొచ్చాడు' అని చుట్టుపక్కల వాళ్ళందరికీ తన్ను చూపుతుందట కోడలు. ఈ సంగతులన్నీ చెప్పి కంటనీరు పెట్టుకున్నాడు పెదతండ్రి. "ఇది న్యాయమేనా నాయనా? పెళ్ళాం మాటలువిని తల్లిదండ్రుల్ని ఇలా చెయ్యటం? అందులో అది యెవరనుకున్నావు?— దుక్కముక్కలవారి ఆడపడుచు. దానికి మనంఅంటేనే గిట్టదు. వాళ్ళకీ మనకీ వున్న విరోధాలు మనస్సులో పెట్టుకొని ఈవిధంగా సాధిస్తూవుంది దానికి లొంగటమా?" అన్నాడు. రోషంతో కోపంతో ఆయన శరీరం వొణికింది.

దుక్కముక్కల వాళ్ళసంగతి జ్ఞాపకం రాగానే పెదతండ్రికి కోపంరావటం కుటుంబరావుకి అర్థంఅయింది. చింతచచ్చినా పులుసు చావలేదు అనుకొని సంతోషించాడు. తమ వూళ్ళో అనాదినుంచీ రెండు పార్టీలున్నాయి. ఒక పార్టీకి నాయకులు దుక్కముక్కల వాళ్లు—రెండో పార్టీకి నాయకులు తనవాళ్లు—తన పెదతండ్రి. దుక్కముక్కలవాళ్లు డబ్బు మనుష్యులు. డబ్బు సంపాదించటం కంటే మరొకదృష్టి వాళ్ళకులేదు. తనవాళ్లు ధనవంతులు; సంస్కారులు. దుక్కముక్కలవాళ్లు దమ్మిడీకి గడ్డితింటారు. వాళ్ళబతుకూ వొక బతుకేనా' అనేవాళ్ళు తనవాళ్ళు. 'మర్యాదమన్నా లేనివాళ్ళు. గర్వోన్మత్తులు' అనీ తనవాళ్లని దుక్కముక్కల వాళ్ళు నిందించే వాళ్ళు. 'తట్టతగలవేసుకునే బాపతు' అనే వాళ్ళు. ఈ విధంగా తనవూళ్లో చాలా కాలంనుంచీ రెండు పార్టీలుండటం కుటుంబరావుకి తెలును. దుక్కముక్కల వాళ్ళని తనవాళ్లు పురుగుల్ని ఏరిపారవేసినట్లు పారవెయ్యటం అతనికి తెలుసు. కాని ఇది చాలా కాలంనాటి సంగతి. ఇటీవల పరిస్థితులు మారినై. అందని హోదాలకుపోయి తనవాళ్ళ కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయినై. జాగర్తగావుండి దుక్కముక్కలవాళ్ళు ధనవంతులయ్యారు. క్రమక్రమేణా వూళ్లో పలుకుబడి సంపాదించారు. లైబ్రరీవాళ్ళ చేతుల్లోకే వెళ్ళింది. స్కూలు వాళ్ళచేతుల్లోకే వెళ్ళింది. పంచాయితీబోర్డు వాళ్ళచేతుల్లోకే వెళ్ళింది. వాళ్లల్లోనూ చదువుకున్న వాళ్లు బయలుదేరారు. పండితులు బయలుదేరారు. అంతకుముందు తనవాళ్లకు వొదిగి వొదిగి వుండేవాళ్లు తనవాళ్లను నిర్లక్ష్యం మొదలుపెట్టారు. మాటకుమాట అంటం మొదలుపెట్టారు. ఈ ప్రవర్తన తనవాళ్లకు చాలా అవమానకరంగా వుండేది. హృదయాలలో నిప్పులు రాజినై. అటువంటివాళ్ళమీద తన పెదతండ్రికి ఏహ్యభావం వుంటం, వాళ్ళపేరు తలిస్తే కోపపూరితుడవటం కుటుంబరావుకి తప్పుగా కనిపించలేదు. ఈ పరిస్థితులన్నీ ఆలోచించకుండా దుక్కముక్కలవారి ఆడపడుచుని వెనక వేసుకొచ్చి, తల్లిదండ్రుల్ని బాధపెడుతున్నందుకు అన్నమీద కోపంవొచ్చింది. తనభార్య తరఫు చుట్టాలనేగాని, తనవాళ్ళనెవ్వరినీ ఇంటికి రానివ్వటం లేదనికూడా విన్నాడు. అటువంటివాడు భార్యరాగానే ఇలా ఎందుకు మారిపోయాడో అతనికి అర్థంకాలేదు. ఏదైనా తన జన్మకు కారకులైన తల్లిదండ్రులను క్షోభపెట్టటం దారుణం.

'ఇకేం చెయ్యదలిచావు పెదనాన్నా?' అని అడిగాడు "ఏముంది నాయనా, చెయ్యటానికి? వాడు పనికిమాలినవాడయ్యాడనే చింతతప్ప, మమ్మల్ని గురించి మాకెప్పుడూ చింతలేదు. మా జీవితాలు ఎల్లాగో వెళ్ల

మారిపోతై...'' అన్నాడు.

''ఉన్న ఇల్లుకూడా ఆయనకేఇస్తివి.''

''ఇచ్చానుబాబూ. వాడునోరు తెరచు కొని అడిగితే కాదన లేకపోయాను. అంత వరదాకా ఎందుకు? మనవూళ్లో మీపెద్దమ్మపేర వున్న ఎకరంఅమ్మి, ఇప్పుడు నేను వుంటున్న వూళ్లోపది ఎకరాలు కొన్నాను భూమి బంగారంవంటి భూమి. మురుగు వస్తుంది. ఒక్క వందరూపాయిలు ఖర్చు పెడితే రాజనాలు పండుతై. నాదగ్గరడబ్బు లేదు. 'వందరూపాయిలు ఇవ్వు నాయనా! ఇకదమ్మిడీ అడగను? అనివాణ్ణిఅడిగాను. వాణ్ణిఅడగటం నాకిష్టంలేదు. మీపెద్దమ్మ పోరు పడలేక అడిగాను. వాడే మన్నాడో తెలుసా నాయనా? 'ఆపది ఎకరాలూ నాపేరపెట్టు, అలాగే ఇస్తాను, అన్నాడు- బాబూ నేను అందుకూ వొప్పుకున్నా. 'అట్లాగే ఇస్తాను. మాకు సంవత్సరానికి ఇంత ఇస్తానని వ్రాసిఇవ్వు' అని అడిగాను నాయనా! ఇక చూడు నామీద ఇంత ఎత్తున లేచాడు.

నామాటనమ్ము, అన్నాడు. నాయనా పోయిందిపోగా ఈపదఎకరాల కోసంతగాదా ఎందుకని నేను 'సరే' అందాంఅను కొన్నాను. మీపెద్దమ్మ వీలులేదని పట్టుపట్టుకు కూర్చుంది. దానిసొంతఆస్తి ముప్ఫై వేలదాకా ఖర్చుపెట్టాను నాయనా. ఎన్నడూ ఒక్కమాటయినా అనిఎఱుగదు. మరి అప్పుడు దానికేం వచ్చిందో వీలులేదనిపట్టుపట్టుకుకూర్చుంది.''

''మంచిపని చేసింది,'' అన్నాడుకుటుంబరావు.

''మంచిపనే అంటావా నాయనా'' అని ఆతురతతో అడిగాడు పెదతండ్రి.

''చాలామంచిపని లేకపోతే ఆఆధారం కూడా లేకుండాపోయేది,'' అన్నాడు కుటుంబరావు.

''పదిఎకరాలు తీసుకొని మళ్లీడబ్బివ్వకుండా మమ్మల్ని కష్టపెట్టేవాడంటావా నాయనా?'' అని ఆశ్చర్యంగా అడిగాడు

పెదతండ్రి అమాయకత్వానికి కుటుంబరావుకి చాలావిచారం కలిగింది. ''ఆహా, అందుకు సందేహమా? ఇన్ని చేసినవాడు ఆదిమాత్రం చెయ్యడూ?'' అన్నాడు.

పెదతండ్రి ఆలోచనలో పడ్డాడు.ఆయనకు కొడుకుమీద విశ్వాసంయింకా పూర్తిగాపోయినట్లు లేదు. ఆదిపోయేటట్లుగా కూడాలేదు. ఎంతఅన్యాయం చేసినా ఎప్పటికప్పుడు ''ఇంతఅన్యాయం చేస్తాడా, తండ్రినే' అనేభావం ఆయనకు పోతున్నట్లులేదు, కొడుకు విడిపోవటం, కొడుక్కీ తనకూ సంబంధంలేదు. అనుకోవటం తండ్రులకు ఎంతకష్టమో తన పెదతండ్రిని చూస్తుంటే తెలిసింది. కుటుంబరావుకు.

''పెదనాన్నా?'' అనిఅతిఆప్యాయంగా పలకరించాడు.

''ఏంనాయనా?''

''వందరూపాయలుంటే పొలంబాగు పడుతుందికాదూ?''

''నిక్షేపంలాగ బాగుపడుతుంది నాయనా''

''నువ్వు ఒకళ్లమీద ఆధారపడ వలసిన అవుసరం లేకుండా పోతుందికదూ.''

''నేనుఒకళ్ళకు పెట్టగలుగుతాను.'' అన్నాడు. పెదతండ్రి ఈమాటలుఅంటూ వుండగానే ఆయన కళ్ళల్లోకి తేజస్సు వొచ్చింది. భారతదేశం పూర్వపుఔన్నత్యం ఆయనకళ్ళల్లో కనిపించింది. కుటుంబరావుకి.

పెదతండ్రి ఆరోజే స్వగ్రామానికి ప్రయాణం అయ్యాడు. ఆయనకు కుటుంబరావు రెండువందల రూపాయలిచ్చాడు. ఆయన ఆడబ్బుతీసుకుని, 'నీకూ పెళ్ళిఅయినది. నీఅన్నకిమల్లే భార్యని వెనకేసుకొచ్చి తల్లిదండ్రుల మనస్సుకి కష్టంగలుగజెయ్యకు నాయనా,'' అన్నాడు.

* * *

ఇదిజరిగి రెండుసంవత్సరాలయింది. ఈ రెండు సంవత్సరాలలో మార్పులనేకం జరిగినై. కుటుంబరావుభార్య కాపురానికి వచ్చింది. అతనికి ఉద్యోగం రావటం, వెంటనే భార్యతో చిత్తూరులో కాపురంపెట్టడము జరిగింది. మధ్యలో ఒకటిరెండుసారులుతల్లిదండ్రులను చూచిపోవటానికి వచ్చాడు గాని భార్యనువిడచి ఎక్కువ రోజులువుండలేకపోయాడు. వెంటనే తిరిగివెళ్ళాడు. తరువాత తండ్రి ఒకసారి రమ్మనిఉత్తరం వ్రాసినావెళ్ళలేదు. దీనికికారణం తీరికలేక కావచ్చు. భార్య నేను వొక్కర్తెనూవుండలేనని చెప్పటం కావచ్చు. లేకపోతే మదరాసులో తోచకపోవటం కావచ్చు. దానిమీదటఅతని చెల్లెలు ''మమ్మల్నిప్పుడే మరచిపోయావా అన్నయ్యా? వదినపక్కనుంచేటప్పటికి మేం కనబడకుండా పోయామా? ముందొచ్చిన చెవులకంటే వెనకొచ్చిన కొమ్ములే యెక్కువవాడని పెద్దలూరికే అన్నారా?'' అని వుత్తరం రాసింది.

ఆ వుత్తరం చూసేటప్పటికి అతనికి నవ్వొచ్చింది. యిదివరకు యే పరీక్షలకో చదువుతూ యింటికి వెళ్ళకపోతే యేమీ అనేవారు కాదు. మహా అంటే 'వొకసారి వచ్చి చూచి వెళ్ళకపోయావా?' అనేవారు. ఇప్పుడు తను రాకపోటానికి భార్యే కారణ మనుకుంటున్నారు.

తనవాళ్లు తన భార్యని యింతగా ప్రేమిస్తున్నా ననుకోటం అతనికి సరదాగావుంది. తన చెల్లెలు రాసిన వుత్తరం భార్యకిచూపించాడు. తనభార్య సంతోషిస్తుం దనుకున్నాడు. ఆమె వుత్తరంచదివి తల పైకెత్తకుండానే 'వెళ్ళి రాకపోయారూ?' అంది.

''ఒకర్తెనూ వుండలేనంటివిగా?''

''నాకోసం వెళ్ళటం మానుకున్నారా ఏమిటి?''

''మరింకెందుకు?''

ఎందుకో మీరు తెలియాలి; మీవాళ్ళకి తెలియాలి.'' ఆమె ఆ వుత్తరాన్ని తను తీసుకున్నంత తేలికగా తీసుకోటంలేదని అతని కప్పటికి అర్థమయింది. నవ్వులాటల్లోకి దించాలని యీ విధంగా అన్నాడు.

''వెళ్ళాలంటే నాకుతీరికేదీ? ఆఫీసు .. భార్యా...కుటుంబం. ఇప్పుడనేక బాధ్యతలున్నయి నామీద. ఇదివరకులాగా వొంటరిగాణ్ణా యెప్పుడూ అక్కడుండ టానికి.''

ఈ విధంగా మాట్లాడుతుంటే అతనికి తన పెదతండ్రీ కుమారుడూ జ్ఞాపకం వచ్చారు. తనుకూడా తన అన్న ధోరణిలో

పడుతున్నట్టు అనుమానం కలిగింది. వెంటనే సంభాషణ ఆపేశాడు. తన పెదతండ్రికి తాను రెండువందల రూపాయలిచ్చినట్టు భార్యకి చెప్పలేదు. మనస్సు కష్టపెట్టుకుంటుందేమోనని చెప్పకుండా వూరుకున్నాడు. యిప్పుడు నెమ్మదిగా తనుకూడా భార్య యిష్టానికి వ్యతిరేకంగా నడవటానికి జంకుతున్నట్టు అనుమానం కలిగింది. తప్పేముంది? ఇద్దరుకలిసి బతకాలంటే వొకరిమీద వొకరికి సానుభూతి వుండి తీరాలి. యితరులమీద సానుభూతి వున్నమాత్రాన తల్లిదండ్రుల మీదవున్న భక్తి తగ్గాల్సిన అవసరం లేదనుకున్నాడు. అయినా వొకసారి తన పెదతండ్రినీ, అన్ననీ చూచిరావాలనిపించింది.

కొన్నాళ్ళకు తన స్నేహితుని వివాహానికివెళ్ళి తన పెదతండ్రి వుంటున్న వూరు, సమీపంలో వుందని తెలుసుకుని అక్కడకు వెళ్ళాడు. తన పెదతండ్రి ఒక పూరిపాకలో వుంటున్నాడు. అతన్ని చూచి పెదతండ్రీ, పెదతల్లీ చాలా సంతోషించారు. మాటా మాటామీద తండ్రి యిటీవల జరిగిన సంగతులన్నీ చెప్పాడు. తనకీ తన కొడుక్కీ రాజీ కుదరలేదట.

ఆ మధ్య తల్లికి జబ్బుచేసి చావటానికి సిద్ధంగావున్నా కొడుకు చూడటానికి రాలేదట. డబ్బుకూడా పంపలేదట. తానిచ్చిన రెండువందల్లో చేబదులుకింద వందపోగా మందులకీ మాకులకే కర్చుఅయిందట! పొలం మరామత్తులేక మామూలుగానే వుందిట. పదిరోజులక్రిందట తన కూతురు చూసిపోటాని కనివస్తే రాక రాక వచ్చిందని తల్లిదండ్రులేమీ పెట్టలేదని విచారపడుతుందని మిగిలిన కొస్త డబ్బు ఆమెకోసం కర్చుపెట్టాడట! ఈ విషయాలన్నీ యదార్థాలేనని ఆయనతో మాట్లాడుతున్న రైతులు ధృడపరిచారు.

ఇటువంటి కొడుకుని మేమెక్కడా చూడలేదన్నారు! తండ్రిని పోషించని కొడుకు బతికేం చచ్చేం! ఆయనకి జరక్కపోతుందా? అవసరమొస్తే మేమే జరుపుకొం' అన్నారు. "కొడుకుమీద వున్న మమకారం పోగొట్టుకోలేని ఆయన కాబట్టి సరిపోయింది. ఇంకోళ్ళయితే కోర్టుకిలాగి ముప్పతిప్పలుపెట్టి మూడుచెరువుల నీళ్లు తాగించేవాళ్లు" అన్నారు.

"వాణ్ణేమీ అనకండి. ఎంతచెడ్డావాడు నాకొడుకు, నారోజులు మంచివికావు కాబట్టి వాడికటువంటి బుద్ధులు పుట్టిస్తున్నాడు" అన్నాడు పెదతండ్రి.

"చూసారా! వాళ్లేంచేసినా వాళ్లమీద మాటపడనీయడు" అన్నాడు వొకరైతు.

పెదతండ్రిని చూస్తుంటే కుటుంబరావుకి కళ్లు చెమ్మగిల్లినై తన దగ్గరవున్న యేభై రూపాయలు తనికిచ్చి బంధువుల్ని చూసి వొద్దామని గ్రామం బయలుదేరాడు. వెళ్ళబోయేముందు అతన్ని చాటుకిపిలిచి పెదతండ్రి యిలా అన్నాడు.

"నాకు డబ్బిచ్చినట్టు వాడికి తెలియనివ్వకు నాయనా"

"తప్పేముంది పెదనాన్నా?"

"తానివ్వకపోగా యితరుల దగ్గరనించి తీసుకున్నట్టు తెలిస్తే వూరుకోడు!"

"ఎందుకని?"

"తనకు నామర్దాఅట. తాను తల్లిదండ్రులకు డబ్బివ్వకుండా, కష్టపెడుతున్నట్టు పదిమందికి తెలుస్తుందట. తనకు పరువునష్టమట."

"అలాగే నాన్నా. తెలియనివ్వను" అన్నాడు కుటుంబరావు లోలోపల తన అన్న చేస్తున్న పనికి వుడికిపోతూ.

అక్కడినించీ కుటుంబరావు స్వగ్రామం వెళ్ళి బంధువుల్నందరినీ వొక్కసారి తిరగవేసాడు. బంధువులందరికీ తన అన్నమీద కష్టంగావుంది. డబ్బుకోసం తన అన్నచేస్తున్న అన్యాయాలూ, మోసాలూ చెప్పి మన వంశంలో చెడబుట్టాడని తేల్చివేశారు. వాళ్లకుకూడా అతన్ని కోర్టుకిలాగి దుంపతెంచాలని వుందటగాని పెదతండ్రి వొప్పుకోటంలేదని చెప్పారు.

'తండ్రితరుపు బంధువుల్ని వొక్కర్ని యింటికి రానివ్వడట. ఎవరైనావెళ్లినా భోజనమన్నా పెట్టకుండా పంపించివేస్తాడట. భార్యతరుపు వాళ్ళనిమాత్రం నెత్తిన పెట్టుకుంటాడట. వూళ్ళో పార్టీల విషయంలోకూడా వాళ్ళకే మద్దతుచేస్తూ వుంటాడట. దుక్కముక్కలవాళ్ళే వాడికిదేవుళ్లు అని చెప్పారు.

ఈ మాటలన్నీవిని కుటుంబరావు సరాసరి తన అన్నవుద్యోగం చేస్తున్న పట్టణానికి ప్రయాణం కట్టాడు.

* * *

"ఎక్కడనుంచోయ్!" అని అడిగాడు రామారావు కుటుంబరావుని చూడగానే. రామారావు, కుటుంబరావు పెదతండ్రి కొడుకు ఆ పట్టణంలో మాస్టరు పని చేస్తున్నాడు.

కుటుంబరావు తన స్నేహితుని వివాహానికివచ్చి చూచిపోదామని వచ్చానని చెప్పాడు. రామారావు వెంటనే యింట్లోకి వెళ్ళి పిల్లలని తీసుకొచ్చాడు. అతనికి ముగ్గురు కూతుళ్ళు వొకకొడుకూ, కొడుకు పెద్దవాడు. కొడుక్కి 'బాబాయ్' అని చెప్పాడు ఆడపిల్లలు ముగ్గురూ బాబాయ్, బాబాయ్అనిచుట్టూ మూగారు కాని మొగపిల్లవాడు దూరంగా నిలబడిచూస్తూ నుంచున్నాడు.

"వీడికన్నీ మన బుద్ధులేవచ్చినయ్." అన్నాడు రామారావు తమ్ముడితో.

ఈ మాటకు కుటుంబరావు వులిక్కిపడ్డాడు. అన్నని తేరిపార చూసాడు. రామారావు చెప్పాడు

"తనకితోచదు. వొకళ్ళుచెపితే వినడు తాపట్టినపట్టేపట్టు. కలుపుగోలుతనం బొత్తిగాలేదు. చూస్తూచూస్తూ యెవరికీ గౌరవము యివ్వలేదు. ఎలాబ్రతుకుతాడో" అన్నాడు.

ఈమాటలకు కుర్రవాడికి కోపంవచ్చి తండ్రిని చురచురచూస్తూ లోపలికి వెళ్ళాడు ఇంతలో లోపలినుంచి వదినవచ్చి కుశలప్రశ్నలు వేసింది, కుటుంబరావుని,

"బాగున్నావా అబ్బాయి?"

"ఆ"

"నాన్నా. అమ్మా అంతా బాగున్నారా?"

"ఆ"

" ఇప్పుడెక్కడ వుద్యోగం "

కుటుంబరావు చెప్పాడు.

" అమ్మాయినీతో నే వుంటూందిగా ? "

" ఆ "

" నువ్వు చిత్తూరు వచ్చింతరువాత మీఅమ్మకాని నాన్నగానీ ఎప్పుడన్నా వచ్చిపోయారా ? "

" లేదు "

" వాళ్ళురారు. " అన్నాడు రామారావు.

" మీదంతా చోద్యం " అందిఅతనిభార్య

" కాదు నాకుమల్లేనేవాడూ భార్య కాపరానికొచ్చిం తరువాత మారిపోయాడని ఈపాటికి తెల్సుకుని వుంటారు " అన్నాడు చిరునవ్వు నవ్వుతూ రామారావు

" మీఅన్నయ్యమాట లెప్పుడూ అట్లాగనే వుంటాయిలే! స్నానంచేద్దురుగాని " అన్నది ముసిముసి నవ్వులు నవ్వుతూ.

" లే బాబాయి; రా. బాబాయి " అని పిల్లలు కుటుంబరావు చేతులు పట్టుకుని లాగటం మొదలు పెట్టారు, స్నానసంధ్యలయింతరువాత అన్నదమ్ము లిద్దరూ భోజనానికి లేచారు.

భోజనం చేసేటప్పుడు అన్నదమ్ములిద్దరూ చిన్నప్పటి సంగతులు జ్ఞాపకం చేసుకున్నారు. తమ గ్రామ పరిస్థితులూ, బంధువుల స్థితిగతులూ చెప్పుకున్నారు.

"మన వూరు యిదివరకు మల్లేలేదు. మన కుటుంబాలు మరీ బొత్తిగా చెడిపోయినయి. ఆర్థికంగా చితికిపోయి అనేక అవలక్షణాలకు స్థావరమయినయి. ఈర్ష్య,— అసూయ, ద్వేషం,—ఇవేమనవాళ్ళ ప్రస్తుత లక్షణాలు. పరాయివాళ్లు, సొంతవాళ్లు అని లేకుండా యెవరు కొద్దిగా బాగున్నా, వాళ్ళ నాశనాన్ని కోరటమే మిగిలినవాళ్ళ పనిగావుంది. ప్రస్తుతం మన కుటుంబాల్ని చూస్తుంటే వొకప్పుడు వైభవోపేతంగా వుండి శిధిలాలైన పురాతన కట్టడాలు జ్ఞాపకం వస్తున్నయి. వాటిని చూస్తుంటే జాలివేస్తుంది. కాని ఏంలాభం? మరామత్తు చేయటానికక్కడా వీలులేనంత ముక్కలై మట్టిలో కలిసిపోతున్నాయి." అన్నాడు రామారావు.

అతనిభార్య చిరునవ్వు నవ్వుతూ "మీరు చెడిపోయిందిచాలక అబ్బాయిని చెడగొడుతున్నారా?" అన్నది.

" నేను చెడిపోయాననే అంటావా?" అన్నాడు రామారావు.

" మీవాళ్ళనడుగుతే తెలుస్తుంది "అంది భార్య

", నీఉద్దేశ్యంచెప్పు " అన్నాడు రామారావు.

"ఆయన మాటలు వినబోకబ్బాయి" అంటూ ఆమె నవ్వుతూ వెళ్ళిపోయింది.

అన్నదమ్ములిద్దరూ భోజనం పూర్తి చేశారు. గదిలో తనకోసం వేసిన పక్కమీద ఆలోచిస్తూ పడుకున్నాడు కుటుంబరావు. తన అన్నయ్య మారాడు పూర్తిగా మారాడు. కాని అమార్పు యితరులు చెపుతుంటే కనిపించినంత భయంకరంగా కనిపించటంలేదు. ఇలా ఆలోచిస్తూ, ప్రయాణబడలికమీద వున్నాడేమో కళ్లు మూసాడు. మధ్యలో మెలుకువవచ్చింది. పక్కగదిలో యెవరో మాట్లాడుకుంటున్నారు, గొంతుకలనుబట్టి తన పెదతండ్రీ, అన్నయ్యలని గ్రహించాడు.

తన పెదతండ్రి యిలా అంటున్నాడు.

" 50 రూపాయ లివ్వునాయనా! మళ్ళీ యిప్పట్లో అడగను"

" మొన్న తీసుకెళ్ళిన డబ్బు ఏం జేశావు?"

" ఏం జెప్పను నాయనా! నీదగ్గర తీసుకొని మనవాళ్ళను చూసి వెళ్దామని మన వూరు వెళ్ళాను. నీ మేనమామ యింట్లో భోంజేసి కళ్ళు మూసాను. లేచిచూచే టప్పటికిలేదు, ఎవర్నడగను నాయనా? అంతా దగ్గిర బంధువులు. ఇంతకీ నాప్రారబ్ధం."

ఈ మాట రామారావు నమ్మినట్టులేదు

" వ్యాజ్యానికి ఖర్చుపెట్ట లేదుగదా?"

వూళ్ళోవాళ్లకి అప్పిచ్చి వుంటావు. లేదు నాయనా నువ్వొద్దన్నపని చెయ్యటమా.

అబ్బే! రామరామ! వాళ్లమాటలు నమ్ముతానా? నీ కష్టార్జితం తీసుకొని వాళ్ల చేతుల్లో పోస్తానా? నువ్వేమను కున్నాను పుబాగా డబ్బు సంపాయించి పెద్దవాడవవ్వాలనే వుంటుంది నాయనా నాకు. తండ్రినే! చేతులారా పెంచానే! నిన్ను కష్టపెట్టాలని వుంటుందా నాయనా నాకు. రామారావు మాట్లాడలేదు, డబ్బు తీసుకురావటానికి లోపలికి వెళ్ళాడని గ్రహించాడు కుటుంబరావు. అతని కంఠా గొడవగా వున్నది. యిదమిద్ధమని తేల్చుకో లేకపోతున్నాడు. పెదతండ్రి యెదట బడితేగాని యదార్థం తేలదని బయట కొచ్చాడు. రామారావు యింట్లోనించి డబ్బుతెచ్చి తండ్రికిచ్చాడు. ఆయన డబ్బు తీసుకొని యిలా అన్నాడు.

" నీ చేత యింతడబ్బు ఖర్చు పెట్టించటం నాకు యిష్టంలేదు నాయనా? నామట్టుకి నాకు నీదగ్గిరే వుండాలని వుంది. కృష్ణా! రామా! అనుకుంటూ నీ పిల్లల్నిచూస్తూవుంటం కంటె నాకేం కావాలి? కాని మీఅమ్మ పడనివ్వదు, దాని స్వభావం నీకు తెలుసుగా నాయనా! నాది అనేదివుండాలని అంటుంది. ఒకళ్ళ పంచను బతకనంటుంది. ఏం చెయ్యను నాయనా? అది బాగాబతికిన మనిషి. యీ అవసానకాలంలో దాన్ని కష్టపెట్టటం నాకు యిష్టంలేదు,

అంతలో కుటుంబరావుని చూసాడు తనను చూసి పెదతండ్రి నివ్వెరపోతాడనుకున్నాడు కాని అలా జరగలేదు. [illegible] కాలంనుంచి చూడనట్టుగా " ఎప్పుడొచ్చావురా? అనిఅడిగాడు.

" ఇప్పుడే ! "

" మీనాన్న బాగున్నాడా? "

" ఆ "

" ఒక్కసారన్నా మమ్మల్ని చూడటా

నికిరాడు. ఇప్పుడు వాడికి కనపడుతున్నా మటలే" అన్నాడు.

"ఆయనకనేక పనులుంటాయి. తీరొద్దూ?" అని సర్దటానికి ప్రయత్నించాడు రామారావు.

"చూడాలని అపేక్షవుంటే తీరికలేకుండావుంటుందా? వాడిచదువుకోసం మేంపడినకష్టం నీకేంతెలుసు? వాడుచదువుకుని ప్రయోజకుడవాలని అవిభక్తకుటుంబము డబ్బుతోచదువుచెప్పించాం. మాకుఅప్పయినది వాడిమూలానకాదూ? వాడిచదువుకోసము తెచ్చినడబ్బే పెరిగి పెరిగి యావత్తుఆస్తినీ దిగమింగింది. ఈనాడు మేమల్లాఏడుస్తున్నామంటే కారణం వాడుకాదూ? కాని వాడికి విశ్వాసంలేదు, మేంతింటున్నామో తింటంలేదో, చస్తున్నామో, బతుకుతున్నామో చూసిపోదామన్నా లేదు, తనేమో తనపెళ్ళామేమో, తనపిల్లలేమో. అంతే" అన్నాడు.

కుటుంబరావుకేమీ తోచలేదు. తలవంచుకొని మెదలకుండా రామారావుకెదురుగుండా కూర్చున్నాడు.

"సొంతకొడుకుని సాధించటం అయినది, తమ్ముని కొడుకుని సాధిస్తున్నారా?" అన్నది, రామారావుభార్య తలుపుచాటునించి.

ఆమెమాట వినగానే "వెళ్ళొస్తానాయనా" అని లేచాడు పెదతండ్రి

"భోంచేసి వెళ్ళండి" అన్నది రామారావుభార్య.

"ఎన్నడూలేని మర్యాద యిప్పుడొచ్చిందే" అన్నాడు పెదతండ్రి.

"అదేమిటినాన్నా...... ...."అని మొదలుపెట్టాడు రామారావు.

'నువ్వేమీభార్యను వెనకేసుకు రావక్కరలేదులేవోయి. వాడిదగ్గర తనమర్యాదను చూపించాలని భోజనానికుండమంది. ఎప్పుడన్నా వుండమన్నదీ?' అనిలేచివెళ్ళిపోయాడు.

"చూశావా అబ్బాయి? ఎవరన్నా వుంటే యిదీవరస. ఎవరూలేకపోతే చక్కగా భోంచేసి వెళతారు. యింతకీఒకర్ననిప్రయోజనమేముంది.? ఈయనలోనేవుంది. మెతక. ఆయనఅడిగినంతడబ్బూ యిస్తారు. ఆడబ్బుతీసుకుపోయి అందరికీ లేనిపోనివిచెబుతారు. ఏంచెప్పినా ఈయనేమోచూస్తూ వూరుకుంటారు" అన్నది.

అన్నదమ్ములిద్దరూ మెదలకుండాకూర్చున్నారు. కుటుంబరావు తలెత్తిచూసేటప్పటికి తనపెదతండ్రి బజారులో నిలబడి రమ్మని చేత్తో సౌంజ్ఞ చెయ్యటం కనిపించినది. అతను నెమ్మదిగాలేచి బయటికివెళ్ళాడు

పెదతండ్రి అతనిని చాటుకుతీసుకువెళ్ళి యిలాఅన్నాడు.

"చూశావా? నాయనా అదీవరస ఎంత చెడ్డా మామనుగదా! దాన్నిచూడు అది యెదటబడి కవ్వించిఎట్లా మాట్లాడుతుందో నీదగ్గిర తానుమంచిదాన్ననీ,తప్పంతానాదేననీ ఋజువుచెయ్యటానికి అదియీయెత్తెత్తింది. నేనుపడతానా? దానిఎత్తులో? .. .. పులల్లేవుండేవాడు. దానిచేతులలోపడి ఎలా పిల్లి అయ్యాడోచూడు. అదిఅట్లా వసపోసిన పిట్టల్లే వాగుతుంటే, వాడొక్కమాటన్నా అన్నాడేమోచూడు.

కుటుంబరావుఏమీ మాట్లాడలేదు. పద్మవ్యూహంలో చిక్కుకున్నట్లు ఉక్కిరి, బిక్కిరి అయ్యాడు. అతీగతీచెప్పకుండా నుంచునేటప్పటికి పెదతండ్రికి అనుమానం కలిగింది. దగ్గరకువొచ్చి అతనిబుజంమీద చెయ్యేసి ఇలాఅన్నాడు. — "నిన్నీమధ్య చూడనట్టు పలకరించానని ఏమన్నా అనుకుంటున్నావా నాయనా? ఏంచెయ్యను? వాడు ఆవులిస్తే పేగులులెక్కపెట్టేరకం. నిన్నింతకుముందే కలిసినట్లు తెలిస్తే నీతో తనమీద ఏవోచెప్పి వుంటానని అనుమానపడి గడపతొక్కనివ్వడు. ఇంతబతుకూ బతికి ముసలితనంలో అందరికీజడిసి బతకాల్సివచ్చింది. నాయనా, అనికన్నీరుపెట్టుకుంటూ, "చూడునాయనా వాడెంతటక్కరో! ఎప్పుడొచ్చినా వుత్తచేతులతో పంపేవాడు. ఇవ్వాళ నువ్వు వున్నావని, ఏమైనాఅనుకు పోతావని అడగగానే ఏభైరూపాయలు యిచ్చాడు," అన్నాడు.

"అదేమిటి పెదనాన్నా? నేనురాకముందే ఇస్తేనూ?" అన్నాడు కుటుంబం.

ఈ మాటకు పెదతండ్రికి కోపంవచ్చింది.యింత ఎత్తున ఎగిరి పడ్డాడు. "నువ్వు రాకముందే యిచ్చాడూ? నువ్వుచూశావూ ఈ కళ్ళతో నేనా చూచింది. నేను అనుకుంటూనే వున్నా ఆమాటా యీమాటా చెప్పి అదినిన్ను బుట్టలో వేసుకొని వుంటుందని మా కడుపున మీలాంటి అడంగివాళ్లు ఎట్లా పుట్టారా?" అని గబగబా వెళ్ళి పోయాడు,

కుటుంబరావు వెళ్ళి పోతున్న పెదతండ్రిని చూస్తూ నిలబడి పోయాడు.

డబ్బుఅడిగాడా ఏమిటోయ్? అని ప్రశ్నించాడు రామారావు యింట్లోకి వస్తున్న కుటుంబరావుని చూచి.

"ఎవ్వరు?" అడిగాడు కుటుంబరావు

"నాన్న"

"లేదు అన్నట్లు అడ్డంగా తలూపాడు కుటుంబరావు"

"చెప్పాడా?" అని మళ్ళీ అడిగాడు రామారావు.

"ఏమిటి?"

"నా సంగతి" అన్నాడు రామారావు చిరునవ్వు నవ్వుతూ.

"ఎందుకు చెప్పరూ? ఆయన పనే అదైతే," అన్నది రామారావుభార్య.

కుటుంబరావు ఒదిన వంకకు చూశాడు. ఆమె చిరునవ్వు నవ్వుతూంది. తన అన్నని చూశాడు. అతడు వినటానికి సిద్ధంగాకూచున్నాడు, కుటుంబరావు తికమకపడి తల

వొంచుకొని, "ఎందు కొచ్చిన గొడవయిదంతా, ఆయనకు సంవత్సరానికి ఇంతనియిస్తే తీరిపోతుంది," అన్నాడు.

ఈ మాటకు రామారావుభార్య భర్తని వోరగా చూచింది.' చిరునవ్వు నవ్వింది. అతను తనతండ్రి కుటుంబరావు ముందు గ్రంథం విప్పి వుంటాడని గ్రహించాడు. తన తమ్ముడు తన్ను అపార్థం చేసుకోవటం అతనికి యిష్టం లేక పోయింది. చెప్పాడు.

"నాసంగతి నీకు తెలుసు. డబ్బు కూడబెట్టటమే జీవితాధర్మం అని నేను అనుకోను డబ్బుకంటే గొప్పవిలువలు కొన్నివున్నాయని నావిశ్వాసం. అందులో ముఖ్యమైంది మానవత్వం. మానవత్వం చంపుకున్నమనిషి మనిషి కాదనీ పశుప్రాయుడనీ నా అభిప్రాయం. జీవితంలోనన్ను ఎదుర్కొంటున్న సమస్యల్ని నేనీ దృష్టితోనే చూస్తాను. అయినప్పటికీ నాన్నని సంతృప్తి పరచలేక పోయాను. ఇది నాన్నకీ నాకూ మధ్య జరుగుచున్న ఘర్షణ కాదు. దేశమంతటా జరుగుతూనే వుంది.

తండ్రులకీ కొడుకులకీ ఇప్పుడు ఏర్పడినంత అగాధం యిదివర కెప్పుడూ ఏర్పడ లేదు. దృష్టిలో అభిప్రాయాల్లో యిప్పుడున్నంత భేదం ఎప్పుడూ లేకపోవటమే దీనికి కారణం. మనముత్తాతల నుంచీ మనతండ్రుల వరకూ స్వల్ప మార్పులతో సంఘం పరిణామం చెందింది. అందుకనే తండ్రీ కొడుకుల మధ్య అట్టే పొరపులు లేకుండా కాలం గడిచింది. భయంతోనూ భక్తితోనూ కొడుకు తండ్రి ఆజ్ఞలకు తలవొగ్గేవాడు. కొడుకులో కలుగుతున్న చిన్న చిన్న మార్పులను చూచీ చూడనట్టు వూరుకునేవాడు తండ్రి. ఇప్పుడలా కాదు. అతి వేగంగా మార్పులు జరుగుతున్నై. తాము నమ్మిన ఆచారాలు, తమను ఉద్రేకపరచిన సిద్ధాంతాలు తమ కళ్ళముందే తారుమారు అవుతూవుంటంవల్ల తండ్రులు తికమకపడుతున్నారు. కాలంతోపాటు మారలేకపోతున్నారు. మారుతున్న తమ సంతతిని అర్థం చేసుకోలేక పోతున్నారు.

నాన్నకిదే జరిగింది. ఆయన్ని నేను నిందిస్తున్నాను అనుకోకు. నా అభివృద్ధికి ఆయనవున్న పరిస్థితుల్లో ఏతండ్రీ కృషి చెయ్యని విధంగా కృషిచేశాడు. అది నేను కాదనను. కాని నా జన్మ కాయన కారణం గనక ఆయనకు మంచిగా కనపడేవన్నీ నాకూ చెడుగా కనపడాలంటే మాత్రం చిక్కొస్తుంది.

నాకు ఉద్యోగం వొచ్చినప్పటినుంచీ నాన్నని నాతోవుండమని బ్రతిమాలుతున్నాను. కాని మొదట్లో ఆయన వొప్పుకోలేదు. 'ఇంతబతుకూ బతికి కొడుకు పంచన పడివుండమంటావా?' అనేవాడు. కోడలి చేతిమెతుకులు తినమంటావా అందులో దుక్కముక్కలవారి ఆడపడుచే అనేవాడు. ఆరోజుల్లో నేనేమన్నా డబ్బివ్వబోతే నువ్వు యిచ్చేవాడివీ నేనుతీసుకునేవాణ్ణినా అనేవాడు అంత పౌరుషంగా వుండేవాడు.

కాని కొద్దిరోజుల్లోనే ఆస్తి వొక సెంటుకూడా లేకుండాపోయింది. జరుగుదలేకష్టం అయింది. సంగతి తెలియగానే, నేనూనీ వొదినా వెళ్ళి బ్రతిమాలి మన ఇంటికి తీసుకొచ్చాం. తీసుకొచ్చాం అన్న మాటే గాని మాకూ వాళ్ళకీకూడా సుఖంలేకుండా పోయింది. వొచ్చిన దగ్గరనుంచీ వాళ్ళు నీవొదినెను సాధించటం మొదలుపెట్టారు. నీవొదినె దుక్కముక్కలవారి ఆడపడుచని నీకు తెలుసు. వాళ్ళకుటుంబాలకూ, మన కుటుంబాలకూ తరతరాలనుంచీ విరోధమని నీకు తెలుసు. నాన్న నిద్రలోకూడా ఈ విరోధం మరచిపోయేవాడు కాదు. ఆవిరోధంతో ఆయన పెరిగాడు. పెద్దవాడయ్యాడు. ఈనాడు మారుదామనుకున్నా మారలేడు.

ఈవిరోధం మనస్సులో పట్టుకుని దాన్ని ప్రతి చిన్న విషయానికీ సాధించేవాడు. 'ఈనాటికి నువ్వు పెట్టేదానివీ నేను తినేవాణ్ణీ అయ్యాం' అనేవాడు. 'నీముత్తాత నాముత్తాత చేలో పరిగె ఏరుకున్నాడు,' అనేవాడు. 'మీవాళ్లు గడ్డితిని డబ్బు సంపాదించారు. వాళ్ళలాగు గడ్డితింటే నేను ఈపాటికి లక్షలు గడించేవాణ్ణి' అనేవాడు. ప్రతివిషయంలోనూ అది డబ్బు ఖర్చుపెట్టటానికి వెనకాడుతూవుందని వూహించుకునేవాడు. పోట్లాడేవాడు. తన తండ్రిని నోటికి వొచ్చినట్లు అంటుంటే విని సహించలేక జవాబుచెప్పితే వెంటనే నాతో ఫిర్యాదు చేసేవాడు. 'అటువంటి దాన్తో ఇన్నాళ్ళనుంచీ నువ్వెట్లా కాపురం చేస్తున్నావురా?' అని అడిగేవాడు. 'అది ఇంట్లో అడుగుపెట్టింది. దరిద్రం చుట్టుకుంది' అనేవాడు. 'ఈ ఇంట్లో అదైనా వుండాలి. నేనైనా వుండాలి' అని పంతం పట్టుకు కూర్చునేవాడు.

నేనేంచేసేది? నాన్నని కూర్చోబెట్టి అనేకసార్లు చెప్పి చూశాను.' ఆయనకు నా మాటలు అర్థంకాలేదు. పైగా నేను భార్యని వెనకవేసుకొస్తున్నానని నామీద లేచాడు. ఆరోజు మొదలుకొని నేను నా భార్యకి దాసుడననీ, దానిమాటలువిని నానా బాధలూ పెడుతున్నాననీ, తిండి కూడా సరిగ్గా పెట్టడంలేదనీ, ఆడదాని అడుగులకు మడుగులొత్తే చీమూ నెత్తురూ లేనివాణ్ణనీ అందరికీ చెప్పటం మొదలు పెట్టాడు.

ఇవన్నీ సహించాం. వాళ్ళ స్వభావం అంతేఅని వూరుకున్నాం. చాటు మాటుగా ఇవన్నీ నామీద చెపుతూ, ఎదురుపడితే నేనంటే బాగానేవుండేవాడు నాన్న. ఇలా వుంటూ నాకొడుకుని దగ్గరకుతీసి వాడిక్కి వాడితల్లిమీద లేనిపోయిన కొండాలు చెపి

మొనకు వీరిచాడు. పసివాడవటంవల్ల వాడు నాన్న చెప్పేమాటలన్నీ నమ్మాడు: నమ్మి వాళ్ల అమ్మకు ఎదురుతిరిగి పోట్లాట్టం మొదలుపెట్టాడు. తల్లి పాడేవాడికి గిట్టకుండా పోయింది. అంతవరకూ ఎలాగో సహించిన నీవొదినె ఇక సహించలేకపోయింది నేను నాన్నకు కొడుకుని తల్లిమీదకు ఉసికొల్పటం ధర్మంకాదని చెప్పాను. ఆయన నా దగ్గర తను ఏమీ ఎరగననీ, గిట్టక తన్ను వెళ్ళగొట్టాలనే ఉద్దేశంతో నీభార్య ఇదంతా కలిపించిందనీ చెప్పాడు. కాని నేను బయటకు అడుగుపెట్టగానే మళ్లీ మొదలు·

ఇవన్నీ చూస్తే నాకూడా అమ్మనీ నాన్ననీ వేరుగావుంచటంకంటే గత్యంతరం కనిపించలేదు. ఒకసారి అమ్మాయివొస్తే తీసుకువెళ్ళి ఒక నెలరోజులు వుంచుకోమని చెప్పాను. అమ్మాయికీ అమ్మాయి భర్తకీ నాన్నంటే అమితభక్తి అని నీకు తెలుసు. అటువంటి వాళ్ళుకూడా పదిరోజులకంటే ఎక్కువ వుంచుకోలేక పోయారు. అక్కడా ఇదేధోరణి. అమ్మాయి భర్తని ఎంతమాట పడితే అంతమాట అనేవాడట. అతను మాంసం తింటాడు, అతనికి మాంసం వొండిపెట్టవద్దని అమ్మాయితో పోట్లాడే వాడట. మన ఇళ్లల్లో మాంసం అలవాటు లేదు. అందుకని మనకోసం అంతా మానుకుంటారా? మాంసం వొండితే మీ ఇంట్లో అన్నంతిననూ, అని పట్టుపట్టుకు కూర్చునే వాడట. మాంసం తినేవాళ్ళని అనరాని మాటలు అనేవాడట! ఈ బాధలు పడలేక అమ్మాయి వాళ్ళని పంపించి వేసింది. తన భర్తను పురుగునుఏరి పారవేసినట్లు వేరి పారవెయ్యటం అది సహించలేక పోయింది. అక్కడనుంచి వొచ్చినప్పటినుంచీ వేరుగానే వుంటున్నారు. తనకు తోచినప్పుడు తోచినట్లు డబ్బు అడుగుతాడు. నేను యిస్తూ వుంటాను. కాని నేనుమాత్రం ఎంతని ఇవ్వగలను?" అని నిట్టూర్పు విడిచాడు రామారావు.

ఈ సంగతులన్నీ వింటూవున్న కుటుంబరావుకి కొంచెంసేపు నుక్క తిరగలేదు. తెరమరుగున తనకు తెలియని విషయాలు ఇన్ని వుంటాయని అతను యెన్నడూ అనుకోలేదు. తన అన్న వేసిన ఆఖరిప్రశ్నకు, విడిచిన నిట్టూర్పుకీ జవాబుగా, "ఆయనకు మాత్రం ఎంతడబ్బు కావాలి? ఆయనకీ పెద్దమ్మకేగా!" అన్నాడు.

"అంతవరకైతే పరవాలేదు. కాని ఆయన నాదగ్గర కసిపట్టి వసూలు చేస్తున్నాడు. నన్ను రచ్చకీడ్చి నలుగురునోళ్ళల్లో పడవెయ్యటమే తనపని అన్నట్లు ప్రవర్తిస్తున్నాడు, నాదగ్గర డబ్బుతీసుకువెళ్తాడు. వూళ్ళో తనపక్షం మాట్లాడేవాళ్ళకి పదులూ, అయిదులూ చేబదుళ్ళిచ్చి వాళ్లు నన్ను తిడుతుంటే తాను సంతోషిస్తుంటాడు. డబ్బు అయిపోగానే మళ్ళీవొస్తాడు. డబ్బు అడుగుతాడు ఇదీఆట" అన్నాడు రామారావు.

"ఆయనపేర కొద్దిదా పొలంవుందని విన్నాను అన్నాడు కుటుంబరావు.

"అవొకపుండు. ఆపొలం పండదు. ఎంత చెప్పినా వినడు. ప్రతిసంవత్సరం వందా రెండువందలైనా ఖర్చుపెడతాడు. దానికోసం శిస్తులకుకూడా డబ్బుచాలదు. మళ్ళీ నేన యివ్వవలసిందే. ఎవరన్నా అడిగితే మనిషన్న తరువాత పది ఎకరాలన్నా లేకపోతే ఎట్లా? అంటాడట. పండదని పొలం వొగులుకుంటామా అంటాడట. నేనేం చెయ్యను? నేను మాత్రం ఎంత డబ్బివ్వగలను. నాసంపాదనా. నీవదిన ఆస్తిమీదవచ్చే అయివేజూ కలిపి నాకుటుంబ ఖర్చులకే చాలదు. ఆయనంటే మనకుగౌరవమే, కానిగౌరవంగాచూసే అవకాశం ఆయనమనకివ్వాలి. ఆయనబాధ్యతే కాక, ప్రపంచంలో మనకిమరికొన్ని బాధ్యతలు గూడా వున్నాయని ఆయనగ్రహించాలి. లేకపోతే "

"అన్నదమ్ములిద్దరూ మాట్లాడకుండా కూర్చున్నారేం" అనిఅడిగింది. రామారావుభార్య.

"దుక్కముక్కలవారి సంగతి ఆలోచిస్తున్నాం వొదినా," అన్నాడు కుటుంబరావు.

"అబ్బాయికి చెప్పారా ఏమిటి?

"ఆ! అన్నీచెప్పాను. తెలిసివుంటం ఎందుకయిన మంచిది.

"ఏం మంచండీ! మీకుమల్లె భార్యమాటలువిని చెడిపోటానికా," అన్నది. దుక్కముక్కలవారి ఆడపడుచు చిరునవ్వు నవ్వుతూ

